స్వగృహే పూజ్యతే మూర్ఖః స్వగ్రామే పూజ్యతే ప్రభుః.
స్వదేశే పూజ్యతే రాజా విద్యాసర్వత్ర పూజ్యతే.

ఎంతటి మూర్ఖుడైనా స్వగృహములో గౌరవించుట తప్పదు. ఎంతటి మూర్ఖుడైనా తల్లిదండ్రులు ప్రేమించక తప్పదు. కారణం ఏమిటి? తమ పుత్రుడగుటచేత ప్రేమానుబంధములను వదలుకొనలేక అభిమాన మమకారముల చేత మూర్ఖుడైనా ప్రేమిస్తుంటారు తల్లిదండ్రులు. గ్రామాధికారి ఎన్ని విధములైన మూర్ఖత్వములో ప్రవర్తించుచున్నా గ్రామస్థులు అతనిని గౌరవిస్తారు. కారణమేమి? అధికారము తన హస్తములో ఉంటున్నది. అధికారము చేకూర్చుకున్న వ్యక్తికి కూడా గౌరవము లభిస్తున్నది. గ్రామమునకు అధికారి. స్థానమునకు గౌరవము చూపాలి. దేశములో రాజు ఎలాంటి వాడైనా ప్రజలు అతనిని గౌరవిస్తారు. కారణము. అధికార స్థానము. ఈనాటి కలియుగమునందు అధికారమునకు, ధనసంపత్తికి గౌరవము ఇస్తున్నారేగాని గుణమునకు గానీ, శీలసంపత్తికి గానీ గౌరవము అందించటము లేదు. విద్య సర్వత్ర పూజ్యతే. ఎట్టి విద్య? ఆత్మవిద్యనే సర్వత్ర గౌరవము ఉంటున్నది. దేశకాల పరిస్థితులకు ఏమాత్రము గురికాక విద్య సర్వత్ర గౌరవింపబడుచుంటుంది. ఆత్మవిద్య మరింత గౌరవము నందిస్తుంది. అదే వేదకాలమందు ఆవిర్భవించిన బ్రహ్మజ్ఞాన తత్త్వము. అదే మ్యాక్స్‌ముల్లర్ ఆ జర్మను ఈ వేద తత్త్వము గురించి అనేక విధములుగా ప్రబోధిస్తూ వచ్చాడు.

మానవుని నుండి ఆవిర్భవించిన మొట్టమొదటి పదము వేదము. అందువలననే Maxmuller కూడా వేదమును గౌరవిస్తూ వచ్చాడు. అతను ప్రత్యేక ఆశ్రమమును నిర్మించుకొని ఆ ఆశ్రమములో ఏకాంత జీవితము గడుపుతూ వేదమును ఇంగ్లీషులో తర్జుమా చేస్తూ వచ్చాడు. ఆనాడు అనేకమంది భారతీయులు Oxford University లో ICS చదువుచుండేవారు. వేదములను పురస్కరించుకొని వారందరికి ఒక చక్కని సందేశము నందిస్తూ వచ్చాడు Maxmuller. What India teaches us అని ఒక పుస్తకము వ్రాసాడు. సత్యం వద, ధర్మం చర, మాతృదేవోభవ, పితృదేవోభవ ప్రధానమైన నాలుగు స్తంభములు భారతీయ సంస్కృతి అనే భవనమునకు అన్నాడు. వేదము నుండి ఆవిర్భవించిన సమస్త ధర్మములు భారతీయ సంస్కృతి యొక్క అంగములే. సంస్కృతి ప్రభావము పురస్కరించుకొని విల్సన్ చాలా వర్ణిస్తూ వచ్చాడు. పరాశర మహర్షి రచించిన పురాణములను తాను ఇంగ్లీషులోకి తర్జుమా చేస్తూ వచ్చాడు. ఆ తర్జుమా చేసిన పద్మపురాణము యొక్క

ప్రభావము చక్కగా వివరిస్తూ కలియుగమునందు పర్తి అనే గ్రామములో సత్య అనే పేరుతో ఐదడుగుల మూడంగుళముల వ్యక్తి ఉద్భవిస్తాడని దానిలో ఉంటున్నది. ఇది యావత్ప్రపంచమును ఆకర్షించే biggest magnet అన్నాడు. ఈ విధమైన నాడీ గ్రంథములన్నీ పరాశర మహర్షి అనేక భారతీయుల భవిష్యత్తు గురించి వ్రాస్తూ వచ్చాడు. మను చక్రవర్తి వ్రాసిన ధర్మశాస్త్రమును గొప్పగా తర్జుమా చేస్తూ Manu's Law అనే book వ్రాసాడు. ఈ మన శాస్త్రములో లేని తత్త్వము ఏ శాస్త్రములోగాని, ఏకాలమునందుగాని, ఏ దేశమునందుగాని లేవు అని నిర్ణయించారు. కనుక భారతీయ సంస్కృతి అనేక రంగములచేత, అనేక భావములచేత యావత్ప్రపంచమును ఆకట్టుకొన్నది. యన్న భారతే తన్న భారత. అనగా భారతములో లేనిది ఏ దేశములో లేవు అన్నారు. సర్వము భారతమునందే ఉంటున్నాయి. ఇట్టి భారత దేశము యొక్క సంస్కృతి తత్త్వము ఈనాడు భారతీయులే విస్మరిస్తూ వస్తున్నారు. భారతీయుల యొక్క సంప్రాప్తిగాని దురదృష్టముగాని, అదృష్టముగాని వారి వారి సంకల్పములపై ఆధారపడి ఉంటున్నది.

అదృష్టము అన్నాను నిన్న. అ-దృష్టం. అనగా దృష్టికి కనుపించనిది అదృష్టము. ఈ అదృష్టము వల్లనే మనకు ప్రాప్తిస్తుంది. సంకల్పములనే బీజములు నాటి కర్మలనే ఫలములు పొందుతున్నాము. కర్మలనే బీజములను నాటి అభ్యాసములనే ఫలములు పొందుతున్నాము. అభ్యాసమనే బీజములు నాటి శీలము అనే ఫలము పొందుతున్నాము. శీలమనే బీజము నాటి అదృష్టమనే ఫలము పొందుతున్నాము. అదృష్టము శీలముపై ఆధారపడి ఉన్నది. శీలము అభ్యాసముపై ఆధారపడి ఉంది. అభ్యాసము కర్మపై ఆధారపడి ఉంది. కర్మ సంకల్పముపై ఆధారపడి ఉంటున్నది. కనుక అదృష్టమునకు మన సత్సంకల్పములే మూలాధారము. దురదృష్టమునకు ఏది కారణము. దుస్సంకల్పములనే బీజములు నాటి, దురభ్యాసమనే ఫలము పండించుకుంటున్నాము. దురభ్యాసమనే బీజములు నాటి దుశ్శీలమనే ఫలము పండించుకుంటున్నాము. దుశ్శీలమనే బీజము నాటి దురదృష్టమును పొందుతున్నాము. అదృష్ట దురదృష్టములు రెండు సంకల్పములపై ఆధారపడి ఉన్నాయి. కనుక సంకల్పములు ఉత్తమమైనవిగా ఉండాలి.

స్వగృహే పూజ్యతే మూర్ఖః. మూర్ఖుడంటే ఎవరు? మంచి తెలిసి కూడా దానిని విస్మరించి ఎంత మంచి బోధించినా దానిని లెక్క చేయక పెడమార్గము పట్టేవాడు మూర్ఖుడు. ఎన్ని విధముల మంచిని బోధించినా తన యొక్క దుర్గుణములను ఏమాత్రము విడువక దానిపైనే పట్టు పట్టి సాధించేవాడు మూర్ఖుడు. సత్యమంటే ఏమిటో తెలుసు. ధర్మమంటే ఏమిటో తెలుసు ధర్మ

ధనునకు, దుశ్శాసనునకు. కాని ఆచరణలో ప్రవేశపెట్టేవారు కాదు. సత్యము ఏమి అని చక్కగా తెలుసు. కాని అసత్యమునే పలికేవారు. తెలిసియు దానిని విస్మరించి తెలియని తత్త్వములను ఆచరించేవాడు మూర్ఖుడు. దివ్యత్వమును విస్మరించి లోకతత్త్వమును అనుసరించేది మూర్ఖత్వమే. ఈనాడు ఇట్టి మూర్ఖత్వము అధికమై పోయింది. కనుక దివ్యభావములు ఈనాడు మానవునియందు ఆవిర్భవించాలి. దైవము గుణాతీతమైనది.

దైవమనగా ఏమిటి? సర్వులయందున్న ప్రేమే దైవము. LOVE IS GOD. ప్రేమ సర్వులయందు ఉంటున్నది. పరమాత్ముడు తన ప్రేమను ఏవిధముగా ప్రకటిస్తున్నాడో అదే విధముగా ప్రతి మానవుడు తనయందున్న ప్రేమ తత్త్వాన్ని ఆవిధముగా ప్రకటించాలి. ప్రేమ పరమపూజ్యమైనది. అనంతమైనది ఈ ప్రేమ. అప్రమాణమైనది ఈ ప్రేమ. అలాంటి తత్త్వమును భగవత్ తత్త్వంగా భావించాలి. ఎంతటి బలవంతుడైనా ఎంతటి మేధాశక్తి కలవాడైనా, ఎంతటి ధనవంతుడైనా ప్రేమను వ్యాపార రీతిగా కొనటానికి వీలుకాదు. ఇది కేవలము అద్దెకు ఇచ్చేవది గాని, అద్దెకు పుచ్చుకొనునది గాని కాదు. ఇది అప్పు తీసుకొనేది గాని, అప్పు ఇచ్చేది గాని కాదు. ప్రేమ సర్వత్ర పరిపూర్ణమై ఉన్నది. ఈనాడు ఇట్టి ప్రేమను వ్యాపార రంగములో ప్రవేశపెడుతూ వస్తున్నారు. కనుక అట్టి ప్రేమను ప్రేమ పూర్వకముగా అందుకోవాలి. అదే మానవుని ప్రధాన లక్ష్యము. ఈనాడు అనేక విద్యలందుకుంటున్నారు. అనేక శక్తులు సంపాయిస్తున్నారు. అనేక పదవులు ఏలుతున్నారు. కాని అది కాదు. పవిత్రమైన ప్రేమను అందుకొనే అర్హతను మనం సంపాదించుకోవాలి. ఇట్టి పరమ తత్త్వాన్ని మనకు బోధించే నిమిత్తమై వేదములు అనేక శాఖోపశాఖలుగా వృద్ధి పొంది మానవులకు ప్రబోధిస్తూ వచ్చారు. ప్రేమ తత్త్వము అనగా ఏమిటి? ప్రేమకు రూపము లేదు. అయితే ఈ ప్రేమ తత్త్వము అనుభూతికి మాత్రం సర్వరూపములు ఉంటున్నవి. ఇది ఎలాంటి రూపం ధరిస్తే అలాంటి రూపాన్ని పొందుతుంటి. ఎవరైనా ప్రశ్నించవచ్చు. గాలికి ఏమి రూపమని. గాలికి రూపం లేదు. కాని గాలి ఉన్నది. గాలియే లేకపోతే నేనే లేను. అయితే దానికి రూపం ఏరీతిగా నిర్ణయించగలము? ఫుట్ బాల్ లో పంపిస్తే గాలి football రూపాన్ని ధరిస్తుంది. బెలూన్ లో వేస్తే బెలూన్ రూపం ధరిస్తుంది. అదే రీతిగా ఏ వ్యక్తిలో ఈ ప్రేమ రూపం చూస్తుంటామో ప్రేమ తత్త్వం ఆ రూపాన్ని ధరిస్తుంది. రెండవది నీరు- నీరుకు రూపం ఉంది. నీటికి ఏ రూపము లేదు. ఎలాంటి పాత్రలో పోస్తే అలాంటి రూపము ధరిస్తుంది. ఆకారము పరస్పరించుకొనియు ప్రేమ తత్త్వము నిరూపిస్తూ వచ్చింది. కాని ఈనాటి మానవుడు పాత్ర చూస్తున్నాడే గాని దాని యొక్క

భావాన్ని ఏమాత్రము గుర్తించటం లేదు. అనగా ప్రవృత్తి మార్గమునే అనుసరిస్తున్నాడు. కాని నివృత్తి తత్వమును అర్థం చేసుకోటం లేదు. భక్తి అనగా ఏమిటి? కేవలం ధ్యానం చేయటం, జపము చేయటము ఇత్యాదిని భక్తిగా భావిస్తున్నారు.

ఈ భక్తిని నవవిధ మార్గములలో చెప్పారు

శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం.

ఈ నవవిధ మార్గములలో ఆత్మనివేదనకు ఉన్నత స్థానము లభించింది. స్నేహము తరువాతనే ఆత్మనివేదనము జరుగుతుంది. అంతవరకు అర్పితము కాదు. అర్పితమనగా ఏమిటి? తనను తాను ఇచ్చుకోటమే. ఈ స్నేహమును మనం పెంచుకోవాలి. స్నేహ తత్వము అంటే ఏమిటి? హలో అంటే హలో అనటమా స్నేహం. కాదు, కాదు. రెండు దేహములు ఒక్క ప్రాణము. అది స్నేహం. రెండు దేహములందు ఒకే భావము ఆవిర్భవించాలి. అదే మైత్రి అన్నారు. మై-త్రి అనగా మూడింటియందు శరీరము మనస్సు, ఆత్మ ఉన్నది ఒకటిటే. అదే నిజమైన స్నేహము. దేహము, మనస్సు, ఆత్మతత్వము అలాంటిది అర్పితమనేది. అప్పుడే ఈ దివ్యత్వము మనకు ప్రాప్తిస్తుంది. నేను నేనే నీవు నీవే అనుకున్నంతవరకు ఇది ప్రాప్తించదు. 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః'. ప్రతి ఒక్కరియందు నా అంశమే ఉంటున్నది. కనుక నీవు ప్రత్యేకముగా ఉండిన వాడవు కాదు. కేవలం దేహములు వేరు అవటంచేత నీవు ప్రత్యేకమైన వ్యక్తిగా భావిస్తున్నావు. ఈ మైత్రి తత్వాన్ని మనం అభివృద్ధి గావించుకోవాలంటే ఆజ్ఞ ప్రకారం చక్కగా నడుచుకోవాలి. ఈనాటి భక్తి. తమ స్వార్థమునే లక్ష్యమునందుంచుకుంటున్నారు గానీ దైవాజ్ఞను ఏమాత్రం పాటించటం లేదు. ఇంక ఎందుకు ఆజ్ఞ ఇవ్వాలి. ఇంక భక్తి తత్వము ఎక్కడ ఉంది? చెప్పినది చేయనప్పుడు భక్తి అనేది ఎక్కడనుండి వస్తుంది? ప్రతి ఒక్కటి దైవాజ్ఞ ప్రకారం నడుచుకోవాలి. అదే నిజమైన మార్గము.

పురందరదాసు చెప్పాడు. 'ఓ భగవంతుడా! నిన్ను మరచిపోటం చేతనే ఈ ప్రపంచములో నేను పుట్టాను. నిన్నే నా హృదయంలో పెట్టుకుంటే నాకు జన్మమే లేదు. అందరి సంశయమునకు ఒకటే కారణము. దేహాభిమానము ఉన్నంతవరకు వానికి సంశయము వదలదు. ఒక్కసారి నీవు విచారణ చేయి. కొండలో రాతిపైన చెట్టు పుట్టింది. దానికి కట్టకట్టి నీరుపోసి ఎరువు వేసి ఎవరు పెంచారు? నీవే పెంచావు. నెమలికి ఇన్ని రంగులు ఎవరు వేశారు. ఎంత గొప్ప

కళాకారుడవు నీవు దేవుడా! పచ్చని చిలుకకు ఎఱ్ఱని ముక్కు పెట్టాడు. ఇది ఎవరు పెట్టారు? ఇవన్నీ ఏ సైంటిస్టు నిర్ణయము చేయగలడు. కేవలము వారు ప్రకృతి ధర్మముగా విశ్వసిస్తున్నారు. కాదిది. ఇది కేవలము నివృత్తి మార్గము. దైవ సంకల్పము చేత సర్వము జరుగుతూ ఉంటుంది. దైవ సంకల్పముతో జరగనిది ఒక్కటి లేదు. అట్టి విశ్వాసము మనము ఈనాడు పెంచుకోవాలి. హీనుడను, నరుడను అని భావిస్తున్నారు అనేకమంది. కానేకాదు. అందుకే పురందరదాసు 'ఓ దేవుడా! నీవు ఉన్నంత వరకు నేను ఎందుకు పరదేశిని అవుతాను. నేను ఎందుకు బీదవాడి నౌతాను. అంతా నీవే చేస్తున్నావు. విద్య చెప్పేవాడు నీవే. బుద్ధి చెప్పేవాడు నీవే. శిక్షించేవాడు నీవే రక్షించేవాడు నీవే. నీ చేతిలో లేనిది లేదు. నాపైన నీకు సర్వహక్కులు ఉన్నాయి. నేను ఎందుకు బీదవాడి నౌతాను. నేను నీవాడను కనుక నాపై నీ హక్కు ఉంది. అందరు దైవాంశ స్వరూపులే. అట్టి సత్యము గుర్తించి అట్టి దైవములో చేరటానికి ప్రయత్నించాలి.

ఎన్ని చదువులు చదివినప్పటికీ, ఎన్ని పదవులు ఏలినప్పటికిని కేవలము పదవిలో ఉండినంత వరకూ గౌరవము పదవులు పోయిన తరువాత ఎవరు నిన్ను గౌరవిస్తున్నారు. దైవ సన్నిధిని నిల్చిన వానికి ఎక్కడ ఉండినా గౌరవమే.

అడవులయందున్న ఆకసమున నున్న
పట్టణమున నున్న పల్లెనున్న
గుట్టమీద నున్న నట్టేటపడియున్న

ఒక్కటే దైవము. తన అభీష్టము నెరవేరెనా దైవము లేకపోతే దయ్యము. అతనే దయ్యముగాని దైవము దయ్యము కాదు. లోకవాంఛలతో నింపుకున్న నీ హృదయానికి నీవే దయ్యము. దయతో నింపుకో లోకవాంఛలతో నింపుకోవద్దు. ఒక ట్యాంకు స్వచ్ఛమైన నీటితో నింపితే ట్యాపునుండి స్వచ్ఛమైన నీరే వస్తుంది. ట్యాంకులో మలినపు నీరుంటే ట్యాపులోనుండి మలినపు నీరే వస్తుంది. యద్భావం తద్భవతి. నీ భావము పురస్కరించుకొనే దైవము నీకు గోచరిస్తాడు. రామాయణములో చెప్పాను. యముడు ఎవరు? రాముడు ఎవరు? యముడే రాముడు రాముడే యముడు. యముడు వేరు రాముడు వేరు కాదు. పాదాక్రాంతుడై శరణు జొచ్చిన విభీషణునికి రాముడు దేవుడుగా కనిపించాడు. కానీ దుర్మార్గములో ప్రవేశించి దుష్టతనము ఆచరించటముచేత రావణునికి రాముడే యముడు అయ్యాడు. 'ఓం నమో నారాయణాయ' అని చింతిస్తున్న

ప్రహ్లాదునికి నారాయణుడే దైవముగా కనిపించాడు. నామరూపములనే ఆధారము చేసుకున్న హిరణ్యకశిపునికి నారాయణుడే యముడుగా మారిపోయాడు. దుష్టగుణముల చేత దయా దాక్షిణ్యరహితుడై స్వంత సోదరినే హింసించుటకు పూనుకున్న కంసునికి యముడుగా కనిపించాడు కృష్ణుడు. కంసుని తండ్రి ఉగ్రసేనునికి కృష్ణుడు దైవముగా కనిపించాడు. దైవము వేరు యముడు వేరు కాదు.

అంతా సద్భావముల పురస్కరించుకొనే వస్తాయి. కాబట్టి అదృష్టదురదృష్టములకు ఇదే మూల కారణము. కనుక మొట్టమొదట మనము అదృష్టులు కావాలి. అదృష్టులు కావాలనుకుంటే చక్కని శీలవంతమైన గుణములు కలిగి ఉండాలి. అట్టి గుణములున్న వానికే ఆ భాగ్యములు చక్కగా ఏర్పడతాయి. అట్టి గుణవంతుడే చక్కని కర్మలు ఆచరిస్తాడు ఎట్టి కర్మలు. సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం. ఏ కర్మలు చేసినా దైవకర్మలుగానే భావిస్తూ రావాలి. అట్టివానికి సత్సంకల్పములే ఆవిర్భవిస్తుంటాయి. దుష్టసంకల్పములు దరికి చేరవు. మనము భగవద్ధ్యానమును హృదయము నందుంచుకొని ఈ ప్రాకృత కర్మలను సక్రమముగా ఆచరిస్తూ రావాలి.

ఈ I.C.S చదివే విద్యార్థులకు Max muller చక్కని ఉపదేశము చేశాడు. చదువు అయిన తరువాత ఒక ఆఫీసరు Max Muller ను చూడటానికి వెళ్ళాడు. ఈ Max Muller నాలుగు వేదములను ఇంగ్లీషులోకి తర్జుమా చేస్తున్నాడు. సంస్కృతము చక్కగా చదివినవాడు. సంస్కృతములో అనేక శ్లోకములు వ్రాస్తూ వచ్చాడు. తిరిగి పునఃప్రాప్తి అంటే భారత దేశములో పుట్టాలని కోరుకున్నాడు. భారత దేశములోని మట్టి ఇంత తలపై వేసుకుంటే అదృష్టవంతుడను అనుకున్నాడు. అలాంటి ఉద్దేశ్యములో ఉత్సాహములో నున్న Max Muller ను చూడటానికి వెళ్ళాడు ఈ ఆఫీసరు. విజిటింగు కార్డు పంపించాడు లోపలకు. ఆ సమయములో Max Muller ఒక సూక్తికి అర్థము యోచన చేస్తున్నాడు. చూశాడు కార్డు. ఈ వ్యక్తి పేరు చతుర్వేద శాస్త్రి. Max Muller చాలా ఆనందించాడు. సర్వెంటును రెండు కప్పులు కాఫీ చేయమన్నాడు. నాకు ఒక్క వేదమే తెలియదు. ఇతను చతుర్వేదశాస్త్రి నాలుగు వేదములు తెలిసినవాడు వచ్చాడు ఎంత అదృష్టవంతుడను అని అనుకున్నాడు. పేరు వింటేనే ఆనందించాడు Max Muller. తక్షణమే అతనిని లోపలికి తీసుకువచ్చాడు. కూర్చోపెట్టి కాఫీ ఇచ్చాడు.

ఎక్కడనుండి వచ్చావంటే నేను ఇండియా నుండి వచ్చాను' అన్నాడు. 'నేను వేదమును తర్జుమా
చేస్తున్నాను. నీవు చతుర్వేద శాస్త్రి వీనికి అర్థము ఏమిటి?' అని అడిగాడు. వేదములు నాకేమి
తెలియదు. అన్నాడు. తాను స్తంభించి పోయాడు. భారత దేశమునుండి వచ్చి చతుర్వేదశాస్త్రి
అని పేరుపెట్టుకొని వేదములనే విమర్శిస్తున్నాడా ఛీ! Today is bad day అనుకున్నాడు.
చూశారా! విదేశీయులలో నున్న విశ్వాసము, విదేశీయులలో నున్న పవిత్రమైన భావములు
భారత దేశములో జన్మించి భారతీయుడని పేరు పెట్టుకొని, భారత దేశము నీరు త్రాగి, భారత
ఆహారము భుజించి, భారత గాలి పీల్చి భారతీయులకే ఈ విశ్వాసములు లేకుండా పోతున్నాయి.
ఆనాడు తనలో తాను సంకల్పించుకున్నాడు. Max muller. ఇంక నేను భారత దేశమునకు పోవ
కరలేదు. భారత దేశమునకు పోతే నాబుద్ధి ఏమై పోతుందో. నేను ఇప్పుడు పవిత్రముగా
పరిశుద్ధముగా ఉంటున్నాను. నిర్మలంగా ఉంటున్నాను. అక్కడ సహవాసముతో ఏమైపోతానో.
company చేతనే మానవుడు చెడిపోతున్నాడు. మంచి వారితో చేరితే మంచి గుణములు వస్తు
న్నాయి. చెడ్డవారితో చేరితే చెడ్డగుణములు వస్తున్నాయి.

మన చెంత మంచి పవిత్రమైన వస్తువులు పెట్టుకోవాలి. మీరు అనుకుంటున్నారు
స్వామి ఉంగరాలు ఇచ్చినా గడియారాలు ఇచ్చినా రక్షలు ఇచ్చినా ప్రాపంచికముగా తృప్తి కోసము
ఇచ్చారని అనుకుంటారు. చాలా పొరపాటు. ఆవిధంగా మీరు భావించకండి. మీ భవిష్యత్తు
జీవితానికి ఇది ఉత్తమమైన, ఉన్నతమైన సోపానము. పవిత్రమైన వస్తువులు ధరించినప్పుడు
పవిత్రమైన భావములే వస్తుంటాయి. ఇదే అరణ్యవాసములో సీత రాములకు చెప్పింది. 'రామా!
నీవు తాపస వేషము ధరించావు. అరణ్యములో సంచరిస్తున్నావు. సర్వసౌఖ్యములతో కూడిన
రాజ్యమును త్యజించావు. పవిత్రమైన జీవితము గడపటానికి వచ్చావు. కాని ఎందుకు ధనుస్సు
పెట్టుకున్నావు. అస్త్రములు వెంట ఉండకూడదు. అస్త్రములు వెంట ఉంటే హింసాభావము
ప్రారంభమవుతుంది. దేనిని హింసించుటకు వచ్చావు అరణ్యమునకు. అరణ్యములో సంచరించే
మృగములు తమ గృహములో సంచరించినట్లుగా ఉంటాయి. తన ఇంటిలో స్వేచ్ఛగా సంచరిస్తు
న్న మృగములను చంపటము హింస కాదా? అవి ఏమి హింస చేస్తున్నాయి. ఎందుకోసం ధనుస్సు
తీసుకు వచ్చావు. ఈ విధంగా ఎలాంటి వస్తువులు మన దగ్గర ఉంటాయో అలాంటి భావాలు
మనదగ్గర ఆవిర్భవిస్తాయి. పిల్లలను చెబుతను. ఈ లోపే పెన్ను ఉంటే అలా వ్రాస్తారు. వ్రాయుటము

17069608

చిన్న కత్తి ఉంటే గోర్లు వస్తావు. కబ్జాలంతా తీస్తావు. ఏమేమో చేస్తావు. పాతజన్మ వాసన. కోతి జన్మ తత్వము. ఇవన్నీ మన దగ్గర పెట్టుకో కూడదు. మంచివి మన దగ్గర పెట్టుకోవాలి. కంఠస్య భూషణం సత్యం. శబ్దములో సత్యము వస్తుండాలి. హస్తస్య భూషణం దానం అన్నారు. దానముతో బాటు దైవానుగ్రహముతో పొందిన రింగు కూడా ధరించాలి. ఇవన్నీ మనకెందుకని అంటారు చాలామంది. యదార్థమును గుర్తించుకోలేని వ్యక్తులే యీ విధమైన భావాలను కలిగుంటారు.

సంస్కృతి అంటే ఏమిటి? సంస్కరింపబడినదే సంస్కృతి. ఎట్లా? వరి పండుతున్నది. పండిన దానిని అట్లానే భుజిస్తున్నామా? గడ్డినుండి ధాన్యము వేరు చేస్తున్నాము. ధాన్యము పైనున్న పొట్టు వేరు చేస్తున్నావు. బియ్యము వండి అన్నముగా చేస్తున్నావు. అగ్ని పాకము జరిగిన తరువాతనే భుజిస్తున్నావు. అగ్ని సంస్కారము జరిగిన తరువాత ఆహారముగా మారుతున్నది. గడ్డినుండి వేరు చేయటము, పొట్టునుండి వేరు చేయటము, అగ్నిలో సంస్కరింపబడటము తదుపరి నీవు భుజించుటము. ఇది సంస్కారము. అనగా చెత్తనంతా తీసివేసి గడ్డిని పొట్టును తీసివేసి బియ్యము వండుకొని భుజించుటము సంస్కారము. ధాన్యము ఒక మూట రెండువందల రూపాయలు. కాని సంస్కరించిన బియ్యము ఒక మూట వేయి రూపాయలు. సంస్కరించటం చేత విలువ పెరిగింది. సంస్కారము చేత విలువ పెరుగుతుంది పరిశుద్ధము అవుతుంది. చెడ్డను దూరము చేసి మంచిని పోషించటమే సంస్కారము. అదే [illegible].

మనము భుజించే ఆహారము పరిశుద్ధమైనదిగా ఉండాలి. ఇది ఒక వెండి తట్టు. వెండి వెండిగా ఉంటుంటే మనము ఉపయోగపెట్టుకోలేము. వెండిని సంస్కరింపచేసి అగ్నిలో వేసి, సుత్తితో కొట్టి సంస్కరింప చేయటం చేత అనుకూలమైన ప్లేటుగా తయారైంది. ఇది ఒక బట్ట. ఏ రీతిగా అయింది? మొట్టమొదట పత్తిగా వచ్చింది. పత్తినుండి దారము తీసారు. దారము నేసి వస్త్రముగా తయారు చేశాము. అప్పుడే దానిని వినియోగించుకొనుటకు వీలైంది. పనికిరాని వస్తువును పనికి వచ్చేటట్లు చేయటమే సంస్కృతి. సంస్కారముతో కూడినదే భారత దేశ సంస్కృతి. ప్రతిదానికి సంస్కారము. బయటనుండి వచ్చినామంటే ముందు కాళ్లు కడుక్కొని ఇంట్లోకి పోతున్నాం. ఎందుకు? బయట మనం సంచరించటం చేత కాళ్లలో అనేక విషక్రిములు చేరి ఉంటాయి. పరిశుద్ధము చేసుకోవాలి. చాలామంది బ్రాహ్మణులు అన్నము వడ్డించుకున్న తరువాత ఆపోసనమని చేస్తారు. చేతిలో నీరు పోసు

కాని తట్ట చుట్టూ చుట్టేస్తారు. పంచప్రాణముల పేర్లు చెబుతుంటారు. ఎందుకోసం చుట్టూ నీరు. ఇది ఒక సంస్కారమే. వండిన వంట లోపల, వడ్డించిన తట్టలో ఉన్న పదార్థములను చీమలు వచ్చి కొంతవరకు కల్మషము గావించవచ్చు. చుట్టూ నీరు పోస్తే చీమలు రావటానికి వీలు లేదు. చిన్న చిన్న విషయములను భారతీయ సంస్కృతి చెబుతూ వస్తుంది. అర్థము లేని మాటలు సంస్కృతములో లేనే లేవు. అర్థము తెలియదుగాని పదములు ఉపయోగపెడుతున్నారు. తెలియనివాడు తెలియనట్లు ఉండడు. తెలిసినట్లుగా మాట్లాడు వాడు. అదే మాఢత్వము. తెలియని దానిని తెలుసుకొనుటకు ప్రయత్నించు. భగవత్ తత్త్వంలో ఎన్నో శక్తిసామర్థ్యములు ఇమిడి ఉంటున్నాయి. వేదములోని ఒక్కొక్క అక్షరములో ఒక్కొక్క శక్తి స్వరూపము ఇమిడి ఉంటున్నది. వాక్ అదే శబ్దము. ఈ పదములో ఇంకొక పదము వస్తుంది. పదము అనేది ఒక పదమే. పదార్థము అనేది ఒక పదమే. పదార్థములో అర్థము ఏమి ఉంటున్నది? పదమునకు అర్థమే పదార్థము. గులాబి పుష్పము పదము. గులాబి పుష్పము అనే పదమునకు ఈ పుష్పమే అర్థము. కర్చీఫ్ అనే పదమునకు ఇదే అర్థము. పదమునకు అర్థము చూపించేది కనుక పదార్థము అని పేరు పెట్టారు. ఇంకాకొన్ని చిత్ర విచిత్రమైనవి ఉన్నాయి. ఆధ్యాత్మిక తత్త్వంలో ఎలచక్కని పదము లుంటున్నవి. అక్షరము. అక్షరము అంటే ఏమిటి? భాషలోని అక్షరములు. వేదాంత పరిభాషలో అక్షరమనగా శాశ్వతమైనదని అర్థము. దీనిలో శాశ్వతములో అశాశ్వతము ఉంటున్నది. అశాశ్వతములో శాశ్వతము ఉంటున్నది. అక్షరం. క్షరం అనగా నశించేది. అ-అనగా నిరంతరము ఉండేది. నశించేది జీవాత్మ. నశించనిది పరమాత్మ. ఆత్మ పరమాత్మల చేరితే అక్షరం. ప్రతి దాని యందు ఎన్నో అంతరార్థము లుంటున్నాయి.

విద్యార్థులారా! మన భారతీయ సంస్కృతి గురించి తెలుసుకోవాలి. అడుగడుగునకు భారతీయసంస్కృతి అర్థము వస్తుంది మనకు. మాట మాటకు భారతీయ సంస్కృతి వినిపిస్తుంది చూపుచూపుకు మధ్యలో భారతీయ సంస్కృతియే. ఒకానొక సమయములో గజరాజు మకరితో బాధపడుతున్నాడు. 'రావే! ఈశ్వర కావవె వరద సంరక్షించు భద్రాత్మకా!' మొరపెట్టుకున్నాడు. తక్షణమే భగవంతుడు వచ్చాడు. అనేకమంది భగవంతుడు దానునకు ఎంతదూరములో ఉంటాడని అడిగారు. కొంతమంది తెలివితక్కువ మేధావులు ఏనుగు అరుస్తే ఎంతదూరం వినబడుతుందో అంత దూరంలో ఉంటాడు భగవంతుడు అన్నారు. ఎంత అజ్ఞానము. ఎక్కడనుంచో ఎక్కడికో రాడు

ఎవరు భగవంతుని ఏ విధముగా ప్రార్థన చేస్తారో ఆ రూపాన్ని ధరిస్తుంటాడు. భగవంతుడు నా వెనుకనే ఉండి సంరక్షించుకోవాలి అని ప్రార్థించే వానికి భగవంతుడు వెంటనే ఉండి సంరక్షిస్తూ ఉంటాడు. అ అని ప్రార్థించుకునే వానికి వెనుకవైపున పాదశబ్దములు మాత్రమే వినిపిస్తుంటాయి. ఓ భగవంతుడా నా కష్టములు నీకు కనిపించటం లేదా, నా ఏడుపు నీకు కనిపించటం లేదా అనే వాళ్ళకు కన్నులు మాత్రమే కనిపిస్తాయి. నా రోదన నీకు వినబడటం లేదా, నా ప్రార్థన నీవు వినటం లేదా అని ప్రార్థించే వానికి చెవులు మాత్రమే ఉంటాయట. అన్నింటియందు నాను ముఖ్యముగా నే కనిపిస్తానుట. షిరిడీలో అట్లే చెప్పింది. నేను ఎప్పుడు నీ వెంటనే ఉన్నానురా నేను నీ వెనుకనే వస్తున్నానురా నీ వెంట ఉన్నాడట. కొంచెం దూరము పోయి ఆ భక్తుడు వెనుకకు చూచుకున్నాడట. వెనుక లేడు. సాయిబాబా ఎంత అబద్ధము చెప్పాడు. నీ వెనుకనే ఉంటున్నాని చెప్పారు కదా! నా వెనుక కనిపించటం లేదే. చెప్పుము బాబా! మీరు ఇంత పెద్దవారు కదా. అబద్ధాలు చెప్పవచ్చా? నా వెనుకనే ఉంటాను అని చెప్పావు. నేను తిరిగి చూస్తే నీవు లేవే? 'ఓరె పిచ్చివాడా! ఇదేనా నీ బుద్ధి. కాదు కాదు. నీవు తిరిగినప్పుడు నీ వీపు కూడా తిరిగింది కదా. నీ వీపు తిరిగినప్పుడు నేను తిరిగాను. నేను ఎప్పుడు నీ వెనుకనే ఉంటున్నాను. దైవము యొక్క పదములు ఎంత నిగూఢముగాను, ఎంత రహస్యమైనవిగాను, ఎంత విచిత్రమైనవిగాను ఉంటుంటాయి. అందరు అర్థము చేసుకోలేరు. అర్థము చేసుకోటానికి నీవు ప్రయత్నించవద్దు. చెప్పినది విని నడుచుకో. అదే నీ కర్తవ్యము. భగవద్విషయముల లోపల ఎంతెంతో ముందు తెలుసుకోవలసినది ఉంది. భగవద్విషయములు తెలుసుకొనుటకు ఎవరికీ సాధ్యము కాదు. సామాన్యమైన మానవుడుగా కనిపిస్తాడు. కానీ అద్భుతమైన శక్తి ఆవిర్భవిస్తుంది. అది అందరికీ సాధ్యము కాదు. నీ కర్తవ్యము నీవు నిర్వర్తించు. నీ సందేహములు అర్పితము గావించు కోటాని దైవమునకు అర్పితము గావించు. అదే నీ ప్రధాన కర్తవ్యము.